క్లుప్తంగా

విద్యార్థులలో సామర్థ్యాలను పెంపొందించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ ఆదామ్‌బాషా

సి.బెళగల్: ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు విధులపట్ల అంకిత భావంతో పని చేసి, విద్యార్థులలో సామర్థ్యాలను పెంపొందించాలి ఎంఈఓ ఆదామ్‌బాషా సూచించారు. మండలంలోని గుండ్రేవుల గ్రామం ప్రాథమికోన్నత పాఠశాలను మంగళవారం ఎంఈఓ తనిఖీ చేశారు. రికార్డులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు వివరాలను పరిశీలించారు. విద్యార్థులతో పాఠ్యాంశాలను చదివించిన ఎంఈఓ వారి సామర్థ్యాలను తెలుసుకున్నారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని హెచ్‌ఎం పాండురంగారెడ్డికి ఎంఈఓ సూచించారు.

కొనసాగుతున్న గాలింపు



కుందూనదిలో గాలిస్తున్న దృశ్యం

పాణ్యం: మండల పరిధిలోని తొగర్చేడు గ్రామం కుందూ నదిలో మూడురోజుల కిందట గల్లంతైన వెంకటేశ్వర్లు కోసం గాలింపు కొనసాగుతోంది. మంగళవారం ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు, గజ గాతగాళ్లు నదిలో గాలిస్తున్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



మోహినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు

గడివేముల: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ జూనియర్ పోటీల్లో కరిమద్దెల జిల్లా పరిషత్ ఉన్నపాఠశాల 8వ తరగతి విద్యార్థిని మోహిని ప్రతిభ చాటింది. ఈ మేరకు సిల్వర్ మెడల్ సాధించినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు బాల వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. శ్రీసత్య సాయి జిల్లాలోని కదిరిలో జరిగిన పోటీల్లో మెడల్ సాధించిందన్నారు. మోహినిని ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఆనంద్‌బాబు, గ్రామ పెద్దలు ఎస్‌వీ రాంభూపాల్‌రెడ్డి,ఎస్‌వీ చంద్రశేఖరరెడ్డి అభినందించారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



క్యాంటిన్‌లో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న ఫుడ్‌సేఫ్టీ అధికారులు

పాణ్యం : ఆహార పదార్థాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఉమ్మడి జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు వెంకటరాముడు, కాశీం వలి అన్నారు. మంగళవారం ఆర్‌జీఎం, శాంతిరాం కళాశాల ప్రాంగణాల్లోని క్యాంటిన్లు, హాస్టళ్లలో ఆహార పదార్థాలను పరిశీలించారు. తప్పని సరిగా ప్రతి రోజూ ఆహార పదార్థాలు శుభ్రం చేసి వండుకోవాలన్నారు. అధిక రోజులు ఫ్రిజ్‌ల్లో నిల్వ ఉంచి వండితే అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. తాగే నీరు నుంచి తినే ఆహారం వరకు నాణ్యతగా ఉండాలని సూచించారు.

కారు ఢీకొని ఆవు మృతి



దెబ్బతిన్న కారు



మృతి చెందిన ఆవు

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె వద ఎస్ టర్నింగ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ఆవు మృతి చెందినట్లు హైవే పెట్రోల్ సిబ్బంది మంగళవారం తెలిపారు. వారి వివరాల మేరకు తిరుపతి నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారుకు ఎస్ టర్నింగ్ వద్ద ఆవు అడ్డుగా వచ్చింది. ఈ ఘటలో ఆవు చని పోగా కారు ముందుభాగం దెబ్బతినింది. కారులో నలుగురు ఉన్నట్లు తెలిపారు. అయితే ఎయిర్ బెలూన్ ఓపెన్ కావడంతో వారికి ఎలాంటి గాయాలు కాలేదు.

దరఖాస్తుల ఆహ్వానం

పాణ్యం: మండల కేంద్రం పాణ్యం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్ట్ అధ్యాపకులుగా పని చేసేందుకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రామన్ తెలిపారు. రసాయన శాస్త్రం, చరిత్ర బోధించుటకు ఈనెల 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. యాభై శాతం మార్కులతో పోస్టు గ్రాడుయేషన్ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. 26న డెమో ఉంటుందన్నారు. పదవి విరమణ చేసిన జూనియర్ ఉపన్యాసకులు, టీచర్లకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాల కొరకు 9492401664కు సంప్రదించాలన్నారు.

శిథిలావస్థలో ప్రభుత్వ భవనాలు!

- కూలేందుకు సిద్ధం అంటున్న పాత భవనాలు
- అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిన వైనం
- ఇబ్బంది పడుతున్న ప్రజలు.. స్పందించని అధికారయంత్రాంగం



నన్నూరులో నిరుపయోగమైన హాస్టల్ భవనం



హుసేనాపురంలో శిథిలమైన పాఠశాల భవనం



హుసేనాపురంలో నిరుపయోగంగా సొసైటీ భవనం



హుసేనాపురంలో గొర్రెల ఆసుపత్రి భవనం దుస్థితి

ఓర్వకల్లు: ప్రజల సౌలభ్యం నిమిత్తం కొన్నేళ్ల క్రితం నిర్మించిన ప్రభుత్వ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. పరిసర ప్రాంతాల ప్రజలకు తీవ్ర అసౌకర్యంగా మారాయి. పురుగు, పుట్టలకు నిలయంగా మారడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని హుసేనాపురం, నన్నూరు గ్రామాలలో పురాతన ప్రభుత్వ భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారాయి. హుసేనాపురం ప్రాథమిక పాఠశాల వద్ద గొర్రెల ఆసుపత్రి నిమిత్తం నిర్మించిన భవనంలో గొర్రెలు, జీవాలకు వైద్య సేవలు అందించేవారు. కొంతకాలం తర్వాత సమీంలోనే పశువైద్యశాల నిర్మించడంతో గొర్రెల వైద్య సేవలు నిలిచిపోయాయి. దీంతో ఆ భవనం పాతబడింది. కొందరు అత్యవసరాలకు వాడుకుంటున్నారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా రాత్రివేళల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ఆక్రమణకు గురయ్యే అవకాశం లేకపోలేదని గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

శిథిలమైన తరగతి గదులు

హుసేనాపురం ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్మించిన తరగతి గదులు శిథిలమయ్యాయి. సుమారు 30 ఏళ్ల క్రితం 1–5 తరగతులను ఈ గదిలోనే నిర్వహించేవారు. కాలక్రమేణా విద్యార్థుల సంఖ్య పెరగడంతో పక్కనే ఆధునిక హంగులతో నూతనంగా పాఠశాలకు అదనపు గదులు నిర్మించారు. పాత తరగతి గదిని నిరుపయోగంగా వదిలేశారు. దీంతో ప్రస్తుతం ఈ గది పూర్తిగా శిథిలమై కూలడానికి సిద్ధంగా ఉంది. విషపురుగులు సంచరిస్తుండడంతో విద్యార్థులు భయాందోళనకు గురవతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాడుపడిన శిథిలమైన గదులను కూల్చివేయాలని విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు కోరుతున్నారు.

అసాంఘిక కార్యాకలాపాలకు నిలయమైన పాత సొసైటీ భవనం

హుసేనాపురం గ్రామంలో గడివేముల రోడ్డు ప్రక్కన నిరుపయోగంగా ఉన్న సొసైటీ భవనం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. దాదాపు 45 ఏళ్ల క్రితం రైతుల సౌలభ్యం కోసం వ్యవసాయ సహకార సంఘం కార్యాలయ భవనాన్ని నిర్మించారు. ఆ భవనం దళిత కాలనీకి దగ్గర ఉండడంతో రైతులు కార్యాలయానికి రావడానికి సుముఖత చూపడం లేదనే కారణంతో మరోచోట అద్దెభవనంలో సహకార సేవలు అందజేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో ప్రభుత్వ భవనం పాతబడి శిథిలావస్థలో దర్శనమిస్తోంది. పాతపడిన భవనాలను పునర్నిర్మించి ప్రభుత్వ సేవలకు వినియోగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నన్నూరులో నిరుపయోగంగా హాస్టల్ భవనం

మండలంలోని నన్నూరు గ్రామం ఎస్సీ కాలనీలో నిర్మించిన హాస్టల్ భవనం నిరుపయోగంగా మారింది. ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహం నిమిత్తం 30 ఏళ్ల క్రితం పక్కాభవనం నిర్మించారు. 2015లో అప్పటి టీడీపీ ప్రభుత్వం తక్కువ విద్యార్థులు హాస్టళ్లను ఇతర హాస్టళ్లలో కలపాలన్న ఆదేశాల మేరకు వసతి గృహం పాడుపడింది. అప్పటి నుంచి హాస్టల్ గదులను కొందరు సొంత అవసరాలకు వినియోగిస్తున్నట్లు సమాచారం. అంతేగాక హాస్టల్ ప్రాంగణం చుట్టూ ముళ్లపొదలు పెరిగి పాములు తేళ్లకు ఆవాసంగా మారింది. చుట్టుప్రక్కల నివాసులు భయాందోళనకు గురువుతున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో... సచివాలయ భవన నిర్మాణం



లొద్దిపల్లెలో పాత సత్రం స్థలంలో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లీనిక్ సెంటర్

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మండలంలోని నన్నూరు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పాడుపడిన భవనాన్ని తొలగించి 1వ సచివాలయ భవనాన్ని నిర్మించారు. అలాగే లొద్దిపల్లె గ్రామంలో ఉమ్మలరెడ్డి చిన్నమ్మ, గిద్దారెడ్డి దపంతులు తమకున్న సుమారు 5 సెంట్ల స్థలంలో హరదేసి, పరదేసీల కోసం సత్రం నిర్మించారు. మారుతున్న కాలాన్నిబట్టి ఎవ్వరూ ఉండకపోవడంతో ఆ సత్రం నిరుపయోమైంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఆ సత్రాన్ని తొలగించి ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను నిర్మించారు.

సచివాలయం ఏర్పాటు చేయాలి



ఏళ్ల తరబడి నిరుపయోగంగా వున్న హాస్టల్ భవనం స్థానంలో సచివాలయం ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం హరిజనవాడ ప్రజల కోసం నిర్మించిన 2వ సచివాలయం కాలనీ ప్రజలకు దూరంగా ఉంది. అదే మార్గంలో మద్యం దుకాణం ఉండడంతో మహిళలకు మరింత ఇబ్బందిగా మారింది. కాలనీ ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వృథాగా ఉన్న హాస్టల్ భవనంలో సేవలందించాలని జిల్లా కలెక్టర్‌కు విన్నవించాం. – పెద్ద మునిరంగడు, నన్నూరు

పాత భవనాలను ఉపయోగంలోకి తేవాలి



పాత భవనాలను ఉపయోగంలోకి తీసుకురావాల్సి అవసరం ఉంది. ఆ దిశగా అధికారులు కృషి చేయాలి. గత ప్రభుత్వంలో లొద్దిపల్లెలో పాతపడిన సత్రం స్థలంలో విలేజ్ హెల్త్ క్లీనిక్ నిర్మాణం జరిగింది. దీంతో ప్రజలకు ఆరోగ్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. వృథాగా ఉన్న స్థలాలలో ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించాలనే ఆలోచన కల్పించింది. –ప్రభాకర్‌రెడ్డి, లొద్దిపల్లె

శిథిలమైన భవనాలను తొలగించాలి

గ్రామంలో ఏళ్ల తరబడి వినియోగంలోలేక శిథిలమైన భవనాలను తొలగించాలి. ఆ స్థలాలో ఇతర ప్రభుత్వ కార్యాలయాలు నిర్మిస్తే ప్రజలకు ఉపయోగపడుతాయి. భవనాల పరిస్థితి మేరకు పునర్నిర్మించి ఉపయోగంలోకి తేవాలి. శిథిలమైన భవనాలు తేళ్లు, పాములకు కేంద్రంగా మారుతున్నాయి. పాత భవనాలను ఉపయోగంలోకి తీసుకొచ్చేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలి. – గోవిందు, హుసేనాపురం

పరిసరాల పరిశుభ్రతతో దోమల నివారణ



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీమంత్

కోడుమూరు రూరల్: పరిసరాల పరిశుభ్రతతో దోమలను నివారించవచ్చునని కోడుమూరు కోలొకేటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి డా.శ్రీమంత్ మాదన్న సూచించారు. కోడుమూరులో దోమల వల్ల కలిగే రోగాలు, జ్వరాలపై మంగళవారం వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్యాధికారి డా.శ్రీమంత్ మాదన్న మాట్లాడుతూ దోమల మూలంగా మలేరియా, డెంగీ వంటి ప్రమాదకరమైన జ్వరాలు సోకుతాయన్నారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగతంతోపాటు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనారోగ్య సమస్యలుంటే నిర్లక్ష్యం చేయొద్దని, వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ కమాల్‌సాహెబ్, సూపర్‌వైజర్ ఉమాభాయి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి

గడివేముల: అల్లర్లకు పాల్పడినా, ప్రోత్సహించినా వారిపై కఠిన చర్యలు తప్పవని పాణ్యం సీఐ కిరణ్ కుమార్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం మండల పరిధిలోని పెసరవాయి గ్రామాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకొని వచ్చి పరిష్కరించుకోవాలన్నారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో అలజడులు, గొడవలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. చిన్నపిల్లలకు బైకుల ఇవ్వవద్దన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బిలకలగూడూరులో ఉచిత పశువైద్య శిబిరం



పాడి రైతులకు ఉచితంగా మందులు అందజేస్తున్న డాక్టర్లు, నాయకులు

గడివేముల: మండల పరిధిలోని బిలకలగూడూరులో మంగళవారం ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్, నాబార్డ్, నవయూత్ అసోసియేషన్, జిందాల్ పరిశ్రమ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గాలికుంటు వ్యాధి సోకకుండా120 పశువులకు టీకాలు వేయడంతో పాటు, 45 పశువులలో గర్భకోశ వ్యాధులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏడీ పాణ్యం డాక్టర్ కరుణాకర్, వైద్యులు డాక్టర్ పావని, సాయి హరిణి, బాబా ఫక్రుద్దీన్, నాయకులు ఎస్‌ఏ రఫిక్, జయంత్ రెడ్డి, నబి రసూల్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మంచి భవిష్యత్తు

కర్నూలు (టౌన్): క్రీడలతో మంచి భవిష్యత్తు ఉంటుందని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు అన్నారు. మంగళవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలోని బాస్కెట్‌బాల్ ఎరినాలో ఫ్లోర్ బాల్, షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటిన క్రీడాకారులను ఆయన అభినందించారు. ఎంపికైన క్రీడాకారులు నిత్యం సాధన చేయడం వల్ల ఉత్తమంగా రాణిస్తారన్నారు. జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి జి.శ్రీనివాసులు, న్యాయవాది శ్రీధర్ రెడ్డి, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకోండి

ఓర్వకల్లు: పొదుపు సంఘాల సభ్యులకు కేంద్ర ప్రభుత్వం కల్పిస్తున్న శ్రీనిధి రుణసదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం వెంకటరామిరెడ్డి సూచించారు. స్థానిక పొదుపు భవన్‌లో మంగళవారం మహిళలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వయం సహాయ సంఘాల సభ్యులకు బ్యాంకుల రుణాలతో పాటు, కేంద్ర ప్రభుత్వం వ్యక్తిగత రుణాలను మంజూరు చేస్తుందన్నారు. మొదట రూ.1 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు రుణసదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి మహిళలు సమీపంలోని బ్యాంకు అధికారులను సంప్రదించాలని తెలిపారు. ఇప్పటి వరకు ఓర్వకల్లు, హుసేనాపురం, నన్నూరు బ్యాంకుల పరిధిలో 25 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

కర్నూలు(సెంట్రల్): సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలోని పత్తికొండ, ఆలూరు, మంత్రాలయం నియోజక వర్గాల్లోని నదులు, వాగులు, వంకలు పొంగి పొర్లడంతో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని వివరించారు. దాదాపు నెలన్నర రోజులుగా వర్షాల కోసం ఎదురుచూస్తున్న రైతన్నలకు అనుకోకుండా ఒక్కసారిగా కురిసిన భారీ వర్షానికి పంటలు దెబ్బతినడంతో దిక్కుతోచడం లేదన్నారు. లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి సాగుచేసిన పంటలు దెబ్బతినడంతో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఉచితంగా ఎరువులు, విత్తనాలు, మందులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

25న రగ్బీ పోటీలు

కర్నూలు (టౌన్): జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 25న స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో అండర్‌– 12 విభాగంలో బాల బాలికలకు రగ్బీ క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా రగ్బీ అసోసియేషన్ కార్యదర్శి రామాంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2012, 2013, 2014 సంవత్సరాల తరు వాత పుట్టిన బాల బాలికలు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని ప్రకటించారు. వివరాలకు 93938 27585 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు

రోడ్లు, కాలువల సమస్యలు పరిష్కరించండి



రోడ్డు నిలిచిన వర్షపునీటిని చూపిస్తున్న పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు

కల్లూరు: కల్లూరు కాలనీలో రోడ్లు, కాల్వల సమస్యలు పరిష్కరించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు పుల్లారెడ్డి, రమణ గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వివిధ కాలనీల అసోసియేషన్ నాయకులతో కలసి కల్లూరు అర్బన్ పరిధిలోని రచ్‌మండ్ కాలనీ, గీతాంజలి నగర్, సన్‌రైజ్ హోమ్స్, పార్థసారధి నగర్ రహదారులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిలయన్స్ గోడౌన్ దగ్గర నుంచి వంద అడుగుల విస్తీర్ణంలో 1.5కిలోమీటర్ దూరం ఉన్న రోడ్డును నగరపాలక సంస్థకు అప్పజెప్పి ఏళ్లు గడుస్తున్న మున్సిపల్ అధికారులు పట్టించుకోలేదన్నారు. రూ.కోటి రూపాయలతో కాలువ నిర్మించి మధ్యలోనే నిలిపివేశారన్నారు. రూ.20లక్షలతో రోడ్డు మరమ్మత్తు చేస్తే ఆరు నెలల తిరగకముందే గుంతలు పడ్డాయని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు వాసుదేవరెడ్డి, సుకుమార్, వెంకటనర్సు, వర్మ, సూరిబాబు, రాఘవేంద్ర, శర్మ, సురేష్, సుబ్బారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

45.5 ఎంఎం వర్షపాతం



గుండ్రేవుల గ్రామంలో నీటమునిగిన వరిపంట

సి.బెళగల్: సి.బెళగల్ మండలంలో సోమవారం మధ్యాహ్నం నుంచి మంగళవారం ఉదయం వరకు వర్షం కురిసింది. 45.5 మిల్లీ మీటర్ల వర్షాపాతం నమోదు అయిందని ఏఎస్‌ఓ ఆదినారాయణ తెలిపారు. గ్రామాల్లోని లోతట్టు పంట పొలాలు వర్షపు నీటిలో మునిగాయి. గుండ్రేవుల గ్రామంలో ఈ మధ్యనే నాటిన వరి పంట నీటిలో మునిగిపోయింది. గ్రామానికి చెందిన గుత్తి లక్ష్మన్నకు చెందిన ఒక ఎకరంతో వరిపంటతో పాటు పొరుగున దాదాపు పది మందికి చెందిన 15 ఎకరాల పైరును వర్షపు నీరు ముంచెత్తింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

పరిశోధనాత్మక విద్యను అభ్యసించాలి



విద్యార్థులతో జేడీ లక్ష్మీనారాయణ

కర్నూలు సిటీ: ఇంజినీరింగ్ చదివేందుకు బీటెక్‌లో చేరుతున్న విద్యార్థులు నిత్యం జీవితంలో వినియోగిస్తున్న వస్తువులు, టెక్నాలజీని వినియోగించడం కాదని, అవి ఎలా తయారు చేశారు? ఎందుకు, ఏమిటి, ఎలా అనేది తెలుసుకునేలా పరిశోధనాత్మక విద్యను అభ్యసించాలని రిటైర్డ్ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం రవీంద్ర మహిళా ఇంజనీరింగ్ కాలేజీలో జరిగిన వ్యక్తిత్వ వికాస కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకునే దశలో చెడు అలవాట్లు, వ్యసనాలకు దూరంగా ఉండాలని, లక్ష్యానికి తగ్గట్టు నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఈ శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పార్టీలను కాదు అభ్యర్థులను చూడాలి

కర్నూలు సిటీ: యువ ఓటర్లు రాజకీయ పార్టీలను కాకుండా ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ప్రొఫైల్‌ను సమీక్షించాలని రిటైర్డ్ ఐపీఎస్ ఆఫీసర్ జేడీ లక్ష్మీనారాయణ సూచించారు. మంగళవారం ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్(ట్రిపుల్ఐటీ డీఎం)లో బీటెక్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులతో జరిగిన ఇండక్షన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల ప్రొఫైల్‌ను సమీక్షిస్తే ఎవరికి ఓటు వేయాలో స్పష్టత వస్తుందన్నారు. యువత ఇన్నొవేటర్స్, క్రియేటర్స్‌గా మారాలని పిలుపునిచ్చారు. యువత పత్రికలను రెగ్యులర్‌గా చదవడం అలవాటు చేసుకోవాలని, అందులో సరికొత్త ఆవిష్కరణలు, సమాజ సమస్యలతో పాటు, దేశ అవసరాలు తెలుస్తాయని వివరించారు. సమస్యలను పరిష్కరించే స్టార్టప్‌లపై దృష్టి పెట్టాలని సూచించారు.

30 మంది వార్డు కార్యదర్శులకు మెమోలు

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలోని సచివాలయాల్లో పనిచేసే 30 మంది వార్డు కార్యదర్శులకు కమిషనర్ రామలింగేశ్వర్ మంగళవారం నోటీసులు జారీ చేశారు. వాటర్ గ్యాప్ అనాలసిస్ సర్వేలో నిర్లక్ష్యం ప్రదర్శించినందుకు కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు సర్వేను పరిశీలించగా కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ వెనుకబడి ఉంది. ఇప్పటివరకు 36 శాతం మాత్రమే సర్వే పూర్తి చేసినట్లు గుర్తించిన కమిషనర్ వారికి మెమోలు జారీ చేశారు. నోటీసులు అందుకున్న 30 మంది వార్డు కార్యదర్శులు తమ పనితీరును త్వరితగతిన మెరుగుపరచుకోవాలని, లేకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.



ఎమ్మిగనూరు రోడ్డులో గుంతలేర్పడి నీరు నిలిచిన దృశ్యం



ఆర్‌టీసీ బస్టాండ్ సర్కిల్లో రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో నిలిచిపోయిన వాన నీరు



కోడుమూరులో హంద్రీ వంతెనపై మట్టిలో మొలచిన గడ్డి

రోడ్లు గుంతల మయం!

కోడుమూరు రూరల్: గుంతలమయమైన రోడ్లు ఆర్‌అండ్‌బీ అధికారులు నిర్లక్ష్యానికి ప్రత్యక్ష సాక్షాలుగా నిలుస్తున్నాయి. కోడుమూరులోని ఆర్‌టీసీ బస్టాండ్ సర్కిల్, ఎంపీడీఓ కార్యాలయ సమీపంలోని ఎమ్మిగనూరు రోడ్డులో వర్షాలకు నడిరోడ్లపై అడుగుకుపైగా గుంతలేర్పడ్డాయి. నెలరోజులుగా వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నా ఆర్‌అండ్‌బీ అధికారులు మాత్రం తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రోడ్లపై ఏర్పడిన గుంతలకు కనీసం మరమ్మతులు కూడా చేయకుండా వదిలేయడంతో వర్షపునీరు చేరి మడుగులను తలపిస్తున్నాయి. భారీ వాహనాలు వెళ్లినప్పుడు గుంతల్లోని మురుగునీరు వాహనదారులు, పాదాచారులపై పడుతుండడంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

వంతెన బాగోగులను గాలికొదిలేశారు

కోడుమూరు–బళ్లారి రోడ్డులోని హంద్రీనదిపై వంతెన నిర్వహణను అధికారులు గాలికొదిలేశారు. ఏళ్ల తరబడి బాగోగులను పట్టించుకోకపోవడంతో వంతెనపై టన్నుల కొద్ది మట్టి పేరుకుపోయింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మట్టిపై గడ్డిమొక్కలు మొలిచాయంటే సంబంధిత అధికారుల పనితీరుకు అద్దపడుతోంది.

బ్రిడ్జిపై గుంతలు...తప్పదు అప్రమత్తత!



పెద్దపాడు వక్కెర వాగు బ్రిడ్జిపై గుంతలు ఏర్పడిన దృశ్యం

కల్లూరు: పెద్దపాడు వక్కెర వాగు బ్రిడ్జిపై భారీగా గుంతలు ఏర్పడడంతో అప్రమత్తత తప్పని పరిస్థితి ఏర్పండి. కర్నూలు నుంచి కోడుమూరు, ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు, పత్తికొండ, కర్ణాటక రాష్ట్రానికి నిత్యం వేలాది మంది ప్రయాణికులు, వందలాది వాహనల రాకపోకలు ఈ బ్రిడ్జిపై సాగుతాయి. బ్రిడ్జి శిలాఫలకం దగ్గర గుంత ఏర్పడడంతో కోడుమూరు నుంచి వచ్చే వాహనాలు గుంత తప్పించుకునే విధంగా సైడుకు వెళ్తున్నాయి. దీంతో కొన్ని సార్లు బ్రిడ్జిపై ట్రాఫిక్ జామ్ అవుతుందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుంతలో వెళ్తే వాహనాల విడి భాగాలు దెబ్బతింటాయని వాహనదారులు కొంచెం లేటైనా సైడు రోడ్డులో వెళ్తున్నారు.